RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి - 13 సంచిక - 388 | 30 శనివారం మే 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--



## యువతను ఇలా నిరాశపరచకూడదు

### : నీట్ లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య

ఎన్నో ఆశలతో 'నీట్' పరీక్ష రాసిన యువతను ఇలా నిరాశపరచకూడదని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో జరిగిన లీక్‌ల నుంచి గుణపాఠం నేర్చుకోలేదంటూ గతవారం కేంద్ర సంస్థ ఎన్టీఏపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా, నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం వల్ల యువత తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తోందని వ్యాఖ్యానించింది.

అఫిడవిట్ దాఖలు చేసిన ఎన్టీఏ

ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. తన పర్యవేక్షణలో నిర్వహించే అన్ని పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది.

పేపర్ లీకేజీ, మాల్ ప్రాక్టీస్ వంటి ఘటనలు జరగకుండా ఉండేలా చర్యలు చేపట్టేందుకు కేంద్ర విద్యాశాఖతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన మాజీ ఇస్రో ఛైర్మన్ కె. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులలో చాలావరకు ఇప్పటికే అమలు చేసినట్లు తెలిపింది. పరీక్ష విధానంలో తాము తీసుకొచ్చిన సంస్కరణలు, భద్రతా మార్పులను కోర్టుకు వివరించింది. ఎన్టీఏ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం కోసం 16 కొత్త సీనియర్ పోస్టులను ఏర్పాటు చేశామని, టెక్నాలజీ ఆపరేషన్స్, టెస్ట్ సెక్యూరిటీ పర్యవేక్షణకు ఇద్దరు జాయింట్ సెక్రటరీల స్థాయి అధికారులను అడిషనల్ డైరెక్టర్స్ జనరల్‌గా నియమించినట్లు అఫిడవిట్‌లో పేర్కొంది. పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయడం, పరీక్ష పూర్తయ్యాక 90 రోజుల పాటు ఫుటేజీని భద్రపరచాలని ఆదేశించినట్లు తెలిపింది. భవిష్యత్తులో నీట్ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్ష మోడ్‌లో నిర్వహించాలా లేక పెన్ అండ్ పేపర్ పద్ధతిలోనే కొనసాగించాలా అనే అంశంపై అత్యున్నతస్థాయి కమిటీ సంబంధిత మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరిపి త్వరలో ఓ నిర్ణయం తీసుకోనుందని కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. ఐఐటీ, యూజీసీ, సీబీఎస్ఈ తదితర సంస్థల నిపుణులను ఎగ్జామినేషన్ మేనేజ్‌మెంట్‌లో భాగస్వామ్యం చేసినట్లు ఎన్టీఏ కోర్టుకు తెలిపింది.

## చాలెంజ్ కాదు..

# చేతనైతే చేసి చూపెట్టు..

### - పొంగులేటి శ్రీనివాస్ సవాలుపై కేటీఆర్ సెటైర్లు

పొంగులేటీ!.. గొప్పలకు పోవడం కాదు. దమ్ముంటే మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్నీ అమలు చేస్తామని ప్రతినబూనండి. మీకు చిత్తశుద్ధి, సత్తా ఉంటే చేసిన చాలెంజ్‌కు కట్టుబడి ఉండాలె. 20లక్షల ఇండ్లు కట్టినంకనే ఓట్ల అడుగాలె. చాలెంజ్ విసరడం, ఆపై పారి పోవడం నీతిలేని కాంగ్రెస్ నేతలకు మొదటినుంచీ అలవాటే.



4



### హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు...

## 'ఈగిల్ టీమ్' పేరిట విధులు

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం, సమాజంలో మార్పునకు నాంది పలుకుతోంది. హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. ఈ చొరవ ద్వారా వారికి గౌరవప్రదమైన జీవనోపాధిని అందించి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములను చేసింది. ఈ బృందంలో 11 మంది ట్రాన్స్ మహిళలు, ఐదుగురు ట్రాన్స్ పురుషులు ఉన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలను తొలగించడంలో వీరు చురుగ్గా పాల్గొంటున్నారు. కబ్జాదారులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా భయపడకుండా, నిర్భయంగా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. వీరిని 'హైడ్రా ఈగిల్ టీమ్'గా పిలుస్తున్నారు. ఈ ఉద్యోగం తమకు కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, జీవితానికి కొత్త గుర్తింపును, ఆత్మగౌరవాన్ని ఇచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా యూనిఫాం ధరించి విధులకు హాజరవడం తమకు ఎంతో గర్వకారణమని చెబుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్‌లో 862 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని, మాదాపూర్‌లోని ఎదులకుంట చెరువును కబ్జాదారుల బారి నుంచి కాపాడటంలో ఈ బృందం కీలక పాత్ర పోషించింది. కబ్జాల తొలగింపు సమయంలో ప్రజలకు నచ్చజెప్పడం, మహిళలతో మాట్లాడి ఉద్రిక్తతలు తగ్గించడం, అధికారులు-ప్రజల మధ్య సమన్వయం చేయడంలో వీరు అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని హైడ్రా అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు. "గతంలో బతుకుదెరువు కోసం అడుక్కునేవాళ్లం. ఎక్కడికి వెళ్లినా హేళన చేసేవారు. పని అడిగితే ముఖం మీదే లేదనేవారు. కానీ, ఇప్పుడు యూనిఫాంలో విధులకు వెళుతుంటే అందరూ మర్యాదగా మాట్లాడుతున్నారు" అని తాన్షి రాయ్ ఆనందంగా చెప్పారు. "అవకాశం ఇస్తే ట్రాన్స్‌జెండర్లు ఏ రంగంలోనైనా రాణించగలరు. హైడ్రాలో మా విధులే దీనికి నిదర్శనం. ఇక్కడ అధికారులు, ఇతర సిబ్బంది మమ్మల్ని సమానంగా చూస్తారు" అని గాయత్రి తెలిపారు. ఈ ఉద్యోగం వల్ల వీరు ఇప్పుడు ఆర్థికంగా స్థిరపడి, తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా 'మేము కూడా సమాజానికి సేవ చేయగలం' అనే ఆత్మవిశ్వాసం వారిలో వెల్లివిరుస్తోంది.

## ఇరాన్‌తో ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకోబోతున్నాం: ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో ఒక కీలక ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకోబోతున్నట్టు సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయబోమని హామీ ఇవ్వడంతో పాటు, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం వంటి కఠిన షరతులను శుక్రవారం ఆయన నిర్దేశించారు. ఈ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించిందా లేదా అనే దానిపై స్పష్టత ఇవ్వనప్పటికీ, తుది నిర్ణయం కోసం వైట్‌హౌస్‌లోని సిచ్యుయేషన్ రూమ్‌లో సమావేశమవుతున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్టులో ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని లేదా బాంబును కలిగి ఉండరాదని ఈ ఒప్పందంలో భాగంగా అంగీకరించాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ ఇంధన సరఫరాలకు కీలకమైన హర్మూజ్ జలసంధిని ఎలాంటి రుసుములు లేకుండా, నౌకల రాకపోకలకు తక్షణమే తెరవాలని డిమాండ్ చేశారు. అమెరికా నావికాదళ దిగ్బంధనం కారణంగా జలసంధిలో చిక్కుకున్న నౌకలు ఇకపై తమ ప్రయాణాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. జలసంధిలో అమర్చిన మైన్‌లను ఇప్పటికే తొలగించామని, మిగిలిన వాటిని ఇరాన్ తొలగిస్తుందని పేర్కొన్నారు. సుమారు 11 నెలల క్రితం అమెరికా బీ2 బాంబర్ దాడి వల్ల పర్వతాల కింద కూరుకుపోయిన 'అణు ధూళి'గా పేర్కొంటున్న ఇంధన పదార్థాన్ని వెలికితీసి నాశనం చేస్తామని ట్రంప్ తెలిపారు. ఈ ఆపరేషన్‌ను ఇరాన్, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) సహకారంతో అమెరికా నిర్వహిస్తుందని వివరించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎలాంటి నగదు లావాదేవీలు ఉండవని ట్రంప్ స్పష్టం చేశారు. అంతగా ప్రాధాన్యం లేని ఇతర అంశాలపై అంగీకారం కుదిరిందని చెప్పినప్పటికీ, వాటి వివరాలను వెల్లడించలేదు. హర్మూజ్ జలసంధికి సంబంధించిన ఏ పరిణామమైనా ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా, భారత్ తన ముడి చమురు అవసరాలలో ఎక్కువ భాగాన్ని ఈ ప్రాంతం నుంచే దిగుమతి చేసుకుంటున్నందున, ఇక్కడ జరిగే పరిణామాలు దేశ ఇంధన భద్రత, రవాణా ఖర్చులు, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరే ఏ ఒప్పందమైనా భారత్‌కు అత్యంత కీలకం కానుంది.

# ప్రతి ఓటును కాపాడుకోవాలి

### : మహేశ్ కుమార్ గౌడ్



దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మిగిలిపోయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియను ఈసీ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియ సమయంలో అనుసరించాల్సిన తీరుపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తమ నేతలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గాంధీ భవన్ ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ మాస్టర్ ట్రైనీలకు ఏఐసీసీ శిక్షణ విభాగానికి సంబంధించిన సౌరభ్, అనూష, నిశాంత్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో బీఎల్ఏలకు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియను పకడ్బందీగా చేశామని వెల్లడించారు. జిల్లా కమిటీలు, మండల కమిటీలు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. పశ్చిమబెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారని.. బీజేపీ చేసిన కుట్రలతో అక్కడ ప్రభుత్వమే మారిపోయిందని మండిపడ్డారు. తెలంగాణలో అలాంటి కుట్రలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు.

## కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు...

### రాహుల్ గాంధీతో షర్మిల భేటీ



కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కర్ణాటకలో త్వరలో రాజ్యసభ ఎన్నికలు ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఆమె పార్టీ అగ్రనాయకుడితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సీటును షర్మిల కోరుతున్నట్లు మీడియాలో ప్రచారం సాగుతోంది. వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన సమయంలో షర్మిలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాజ్యసభ సీటును హామీ ఇచ్చిందని తెలుస్తోంది. ఇప్పుడు కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో, ఏపీలో పార్టీని బలోపేతం చేయడానికి, రాజ్యసభలో కాంగ్రెస్ తరఫున ఏపీ గొంతును వినిపించడానికి తనకు రాజ్యసభ సీటును ఇవ్వాలని ఆమె కోరుతున్నారని తెలుస్తోంది. రాహుల్ గాంధీతో భేటీ అనంతరం షర్మిల కారులో వెళుతుండగా మీడియా పలకరించింది. ఈ సమావేశంలో ఎప్పటిలా సాధారణ సమీక్ష జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఏపీ తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు చెప్పారు. రాహుల్ గాంధీతో భేటీలో షర్మిలతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
30 శనివారం మే 2026

# మోడీ ప్రభుత్వ రైతుకు వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

## కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరల జీవోను దగ్ధం చేసిన రైతు సంఘాల నాయకులు

హైద్రాబాద్ ఎస్టేట్ న్యూస్ /వరంగల్ ప్రతినిధి ప్రకాష్ :
కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఈనెల 27 నుండి 31 వరకు నిరసన కార్యక్రమాలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) జాతీయ వేదిక ఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు నగరంలోని కాశీబుగ్గ అంబేద్కర్ జంక్షన్ లో కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో ప్రతులను రైతు సంఘాల నాయకులు తగుల బెట్టారు.

ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలోని ఆర్థిక వ్యవహారాల ఉప సంఘం ఈ ఖరీఫ్ సీజన్లో 14 రకాల వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర లను ప్రకటించిందని ఇవి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా లేవని రైతు సంఘాల నాయకులు అన్నారు.

12 సంవత్సరాల మోడీ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ సిఫార్సుల అనుగుణంగా కనీస మద్దతు ధరలు అమలు చేస్తామని ప్రకటించి ఈరోజు నామమాత్రపు మద్దతు




ధరలు ప్రకటించిందని వారు విమర్శించారు.

రోజురోజుకు విత్తనాలు రసాయనిక ఎరువులు పురుగుమందులు డీజిల్ సాగునీరు విద్యుత్ ధరలు పెరుగుతుంటే వాటిని అరికట్టడంలో వైఫల్యం చెంది రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నదని సంఘాల నాయకులు దుయ్యబట్టారు.

కేంద్రం మొక్కజొన్నకు పది రూపాయలు వరికి 72 రూపాయలు పత్తికి 557 రూపాయలు మద్దతు ధర పెంపుగా ప్రకటించిందని ఇది తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన పంట నుండి పడేసే తాలు కంటే అద్వాన్నమన్నారు. పత్తికి 11,000 వరికి 3,500 మొక్కజొన్నకు 3000 రూపాయలు గా మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య ఆల్ ఇండియా కిసాన్ సంఘ సంఘ జిల్లా కన్వీనర్ సుధమల్ల భాస్కర్ అఖిలభారత సంయుక్త కిసాన్ సభ జిల్లా అధ్యక్షులు వల్లందాస్ కుమార్ బండి వెంకటేశ్వర్లు బొల్లు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మలూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన వృద్ధాప్య, వితంతువు ఒంటరి మహిళా పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 29ి
మహేశ్వరం నియోజకవర్గం తుమ్మలూరు గ్రామంలో నూతన వృద్ధాప్య పెన్షన్ వితంతు పెన్షన్ ఒంటరి మహిళ పెన్షన్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శ్రీ తుమ్మటి అండాలు కృష్ణ యాదవ్ స్వయంగా పరిశీలించి విజయవంతంగా నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా



పరిశీలిస్తూ, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రజల సేవే ధ్యేయంగా నిరంతరం గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సర్పంచ్ సేవలను గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు మద్ది సునీత రెడ్డి,గుమ్మల పాపిరెడ్డి గ్రామ పెద్దలు నారాయణ, గోల్కొండ రఘువీర్,శ్రీశైలం, రాంచేంద్రారెడ్డి,శ్రీను,గట్టగల శ్రీకాంత్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.తుమ్మటి అండాలు కృష్ణ యాదవ్ సర్పంచ్, తుమ్మలూర్

# మద్దిరాల పోలీస్ స్టేషన్ తనిఖీ




హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)
జిల్లాలో ని పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్ పి నరసింహ మద్దిరాల పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ముందుగా పోలీసు స్టేషన్ సిబ్బంది ఎస్పీ కి గౌరవ వందనంతో స్వాగతం తెలిపినారు, పోలీస్ స్టేషన్ ప్రాంగణం, పరిసరాలు పరిశీలించి. సిబ్బంది చక్కని యూనిఫామ్, క్రమశిక్షణ, పోలీస్ పరికరాలను పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు, ఎలాంటి సమస్య ఉన్న అధికారుల ద్వారా పరిష్కరించుకావాలని సూచించారు. సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తామని తెలిపారు.
పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సెంటర్ నందు రికార్డుల నిర్వహణ ఆన్లైన్ ఫిర్యాదుల నిర్వహణను పరిశీలించారు ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యలు విని వారికి భరోసా కల్పించాలని ధైర్యం కల్పించాలని సూచించారు. ప్రాథమిక విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు, ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేసి ప్రజలకు నమ్మకం కలిగించాలని తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల వద్దకే వెళ్లి పోలీస్ సేవలను అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నందు నిర్వహిస్తున్న రికార్డ్స్ ను తనిఖీ చేసినారు. కేసులు పెండింగ్ ఉండకుండా ఎప్పటికప్పుడు దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. మండల పరిధిలో తరచుగా నేరాలకు పాల్పడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పటిష్టంగా ఉంచి బైండోవర్ చేయడం షీట్స్ నమోదు చేయడం లాంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీటీవీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను పరిశీలించి మండల పరిధిలో ఎక్కువ సీసీ కెమెరాలు పెట్టడానికి గ్రామస్తులను చైతన్య పరచాలని తెలిపారు. సమస్యలపై ఫిర్యాదులు అందుకున్న వెంటనే బాధితుల ఇంటికి వెళ్లి అక్కడినుండే కేసులు నమోదు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దుం అలీ, స్థానిక ఎస్ ఐ వీరన్న, ఆర్ఎస్ఐ అఖిల్, డిసిఆర్బి సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఐటి కోర్ కానిస్టేబుల్ సురేందర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# షాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 29:-
షాబాద్: ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, ఐపీఎస్ శుక్రవారం షాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, పోలీస్ స్టేషన్ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్హెచ్ఓ)తో పాటు సిబ్బందితో సమావేశమైన కమిషనర్,




శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్, క్రమశిక్షణ మరియు విధుల నిర్వహణలో సమర్థతపై పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణ స్పందన ఇవ్వాలని, పోలీస్ స్టేషన్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి నేర నియంత్రణ చర్యలను కట్టుదిట్టం చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. పోలీసులు సమన్వయంతో, అంకితభావంతో పనిచేస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీపీ యోగేష్ గౌతమ్, ఐపీఎస్, ఏసీపీ కిషన్, సీఐ బి. కాంతారెడ్డి తదితర అధికారులు మరియు షాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. కమిషనర్ సూచనలను కచ్చితంగా అమలు చేస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన

## మహిళా వారోత్సవాల్లో తల్లిదండ్రులకు ప్రత్యేక కార్యక్రమం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 29:-
రంగారెడ్డి జిల్లా: మహిళా వారోత్సవాల సందర్భంగా గర్భిణీలు, బాలింతలు మరియు తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల శారీరక, మానసిక అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. లోపపోషణ వల్ల పిల్లల ఎదుగుదల దెబ్బతింటుందని పేర్కొంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.శిశువు జీవితంలోని తొలి 1000 రోజుల ప్రాముఖ్యత, తల్లిపాలు, అనుబంధ ఆహారం, శిశు అభివృద్ధి మైలురాళ్లు, పోషకాహార సంరక్షణకు





సంబంధించిన ఆరు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యం, పోషణ, తక్షణ సంరక్షణ, ప్రారంభ ప్రేరణ వంటి అంశాలపై ప్రత్యేకంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్ద లభించే వ్యర్థ పదార్థాలతో పిల్లల అభివృద్ధికి ఉపయోగపడే లోకాస్ట్ ఆటబొమ్మల తయారీ పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాజెక్టుల నుంచి వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు తయారు చేసిన విద్యా సామగ్రి, ఆటబొమ్మలను ప్రదర్శించారు. వినూత్నంగా రూపొందించిన ఆటబొమ్మలకు అదనపు కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, ప్రథమ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతపై సీఎం దృష్టి సారించాలి

## బి ఆర్ ఆర్ ఫౌండేషన్ వినతి


## మత్తు పదార్థాల నియంత్రణ, ఓ ఆర్ ఆర్ వేగ పరిమితి తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 29:-
తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న రహదారి ప్రమాదాలు, మత్తు పదార్థాల వినియోగం మరియు ప్రజా భద్రతా సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బి ఆర్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బుడిద రాంరెడ్డి ముఖ్యమంత్రి కి వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలు, గంజాయి, మద్యపానం కారణంగా రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అతివేగం, నిద్రమత్తులో వాహనాలు నడపడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్‌లు ధరించకపోవడం వంటి కారణాలతో జాతీయ రహదారులు, ఓ ఆర్ ఆర్ పై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.
ప్రజల భద్రత దృష్ట్యా మత్తుపదార్థాల నిర్మూలనపై కఠిన చర్యలు, అతివేగ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు 24 గంటలు నిర్వహించాలని కోరారు. ఓ ఆర్ ఆర్ పై వేగ పరిమితిని గంటకు 120 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్లకు తగ్గించాలని సూచించారు. అదేవిధంగా జాతీయ రహదారులు మరియు ఓ ఆర్ ఆర్ పై వాహనాలకు ప్రత్యేక లేన్‌లు ఏర్పాటు చేయడం, స్పష్టమైన సైన్ బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయడం, గుంతలు మరియు దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రం పత్రాలను డీజీపీ, హోం శాఖ, రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లకు పంపినట్లు తెలిపారు.

# కోహెడ రైతుల సమస్యలపై కలెక్టర్‌ను ఆశ్రయించిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి

## ఫ్రూట్ మార్కెట్ కోసం భూముల స్వాధీనం.. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 29:-
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కోహెడ గ్రామంలో ప్రతిపాదించిన ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం నేపథ్యంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం సర్వే నంబర్ 167/1 పరిధిలో సుమారు 264 ఎకరాల భూమిని మార్కెట్ నిర్మాణం కోసం స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 160 మంది రైతు కుటుంబాలు భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఫ్రూట్ మార్కెట్ కోసం ఇప్పటికే భూమి కేటాయించినప్పటికీ, ఇప్పుడు కొత్తగా సాగుభూములను ఎంపిక చేయడం రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్న రైతుల పరిస్థితిని ప్రభుత్వం గుర్తించి, వారికి తగిన నష్టపరిహారం మరియు భరోసా కల్పించాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల 3న ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉన్నందున, అంతకుముందే రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను చెప్పుకుంటున్న రైతులపై ఒత్తిళ్లు, బెదిరింపులు లేదా కేసులు నమోదు చేసే చర్యలకు దూరంగా ఉండాలని



ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు ను మర్యాద పూర్వకంగా కలిసిన ముక్కు శ్రీనివాస్ రెడ్డి

శేర్లింగంపల్లి : మే 28 (హైదరాబాద్ ఎస్టేట్ )
కూకట్పల్లి జోన్,మాధాపూర్ సర్కిల్ ,232 వ డివిజన్ భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు ముక్కు శ్రీనివాస్ రెడ్డి , బి ఆర్ ఎస్ పార్టీ శేర్లింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్, ఎమ్మెల్సి శంభిపూర్ రాజు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సి కీ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో




సన్మానించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు సైదారావ్ చౌదరి, రమేష్ గౌడ్,రాజశేఖర్ రెడ్డి,రమేష్,దోబీ ఘాట్ రామాంజనేయులు విజయరెడ్డి, నందిని పాల్గొన్నారు

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
30 శనివారం మే 2026

## ప్రముఖ అంబేద్కరిస్టు ఉద్యమ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ మోహన్ లాల్ గారికి ప్రత్యేక అభినందనలు డాక్టర్ పిట్ట వరప్రసాద్

## సాహెబ్ డా. సవిత అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ 29
మైసాహెబ్ డాక్టర్ సవిత అంబేద్కర్ గారి వర్ధంతి సందర్భంగా వారికి నా ఘన నివాళులు అర్పిస్తున్నాను అని అన్నారు ఈ సందర్భంగా భారతీయ దళిత్ పాంథర్ మరియు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబెద్కర్ )పార్టీ ని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరింపజేసి పార్టీని బలోపేతం చేస్తున్న ప్రముఖ అంబేద్కరిస్ట్, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ గారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను అని తెలిపారు. 1979 నుండి 2000 వరకు దాదాపు రెండు దశాబ్దాల పాటు మైసాహెబ్ అంబేద్కర్ గారితో అత్యంత సన్నిహితంగా కలిసి పనిచేసిన అరుదైన ఉద్యమకారుడు డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ గారు. మైసాహెబ్ భోపాల్‌కు వచ్చిన ప్రతిసారి పాటిల్ గారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా కలుసుకోవడం, వారి మధ్య ఉన్న విశ్వాసపూరిత అనుబంధానికి, ఉద్యమ సంబంధాలకు నిదర్శనం అని కొనియాడారు. మైసాహెబ్ ఆశయాలను, బాబాసాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ గారు చేసిన సేవలు అంబేద్కర్ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి అని భావితరాలకు స్ఫూర్తినిస్తాయని డాక్టర్ వరప్రసాద్ ఉద్ఘాటించారు మైసాహెబ్ కేవలం బాబాసాహెబ్ జీవిత భాగస్వామి మాత్రమే కాదు. ఆమె ఆయనకు వైద్యురాలు, సేవకురాలు, స్నేహితురాలు, సహచరురాలు. మధుమేహం, అధిక రక్తపోటు, న్యూరైటిస్, ఆర్థరైటిస్ వంటి అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాబాసాహెబ్‌కు ఆమె అందించిన సేవలు అపూర్వమైనవి. “నా భార్య సవిత నన్ను సేవించకపోతే నేను మరో 8 నుండి 10 సంవత్సరాలు ముందే మరణించి ఉండేవాడిని” అని బాబాసాహెబ్ స్వయంగా ది బుద్ధ అండ్ హిస్ ధమ్మ గ్రంథంలో పేర్కొనడం ఆమె సేవల గొప్పతనానికి నిదర్శనంగా చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని తెలిపారు.భారత రాజ్యాంగ రచన సమయంలోనూ, 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో జరిగిన చారిత్రాత్మక ధమ్మ దీక్ష కార్యక్రమంలోనూ, బాబాసాహెబ్ సమానత్వ సమాజ నిర్మాణ పోరాటంలోనూ మైసాహెబ్ ఆయనకు అండగా నిలిచారు అని తెలిపారు. బాబాసాహెబ్ మహాపరినిర్వాణం అనంతరం ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ, మైసాహెబ్ ప్రజా జీవితంలోకి తిరిగి వచ్చి మరాఠ్వాడా విశ్వవిద్యాలయ నామాంతర ఉద్యమం, రిడిల్స్ ఇన్ హిందూయిజం ఉద్యమం, బౌద్ధ హక్కుల పరిరక్షణ వంటి అనేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. అంబేద్కర్ వారసత్వ పరిరక్షణలో ఆమె చేసిన కృషి చిరస్మరణీయం. మైసాహెబ్ సవిత అంబేద్కర్ గారిని స్మరించుకుంటూ, బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన సామాజిక న్యాయం, సమానత్వం, మానవ గౌరవం, బౌద్ధ ధర్మం మార్గాలను మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాలని మనమందరం సంకల్పించాలి అని డాక్టర్ పిట్టా వరప్రసాద్ జాతీయ కార్యదర్శిరిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు

## రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా ఎన్నికైన కేరగారి శ్రీధర్ కి ఘన సన్మానం!



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 29:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ డివిజన్ క్యారగారి శ్రీధర్ రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన శుభ సందర్భంగా శాలువాతో సత్కరించి వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ఎల్ బి నగర్ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్ గా అమరోజు రవి కుమార్ నియామపకం.



ప్రకృతి ప్రసాదించిన భూమికి విలువను ప్రసాదించగల ఏకైక వ్యక్తి రియల్ ఎస్టేట్ ఏజెంట్. ఆ ఏజెంట్ ల సహాయం సహకారం లేకుండా వ్యాపారం చేయడం చాలా కష్టతరం. భూమి విలువను ప్రపంచానికి తెలియజేసేది ఏజెంట్. రియల్ ఎస్టేట్లో ఇండస్ట్రీలను తక్కువ సమయంలో కోట్లకు పడగలెక్కించిన ఏకైక రంగం రియల్ ఎస్టేట్ రంగం. ప్లాట్లు, ఇండ్లు, భూములు కొన్న దగ్గర నుండి రిజిస్ట్రేషన్ అయ్యేదాకా నిజాయితీగా సేవలందించేవారు ఏజెంట్లు. అలాంటి ఏజెంట్లకు ప్లాట్లు భూములు మరియు కొనిపించిన, అమ్మించిన వారికి అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ అసోసియేషన్ బలోపేతం కోసం లితెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అండగా ఉంటున్నదని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్ అన్నారు గత కొన్ని సంవత్సరాలనుండి రియల్ ఎస్టేట్ రంగంలో ఆధారపడి రియల్ ఎస్టేట్ రంగాన్నే నమ్ముకున్న రియల్టర్స్ కీ అండగా ఆసరాగా బాసరగా నిలబడి కొట్లాడి రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్న రియల్టర్స్ అందరికీ నేను అండగా ఉంటామని ఎల్ బి నగర్ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్ గా అమరోజు రవి కుమార్ కీ నియామపాక పత్రం అందచేయడం జరిగింది.

## స్పష్టమైన విధి విధానాలు విడుదల చేసిన తర్వాతే ఉపాధ్యాయ, పెన్షనర్ల హెల్త్ కార్డుల అమలు చేపట్టాలి.టి. యు. టి. యఫ్.



రామినేని వెంకటేశ్వర్లు
రాష్ట్ర అధ్యక్షులు



లచ్చుమల్ల వెంకన్న
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్: ప్రతినిధి సెక్రటేరియట్, హైదరాబాద్
తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టి.యు.టి.ఎఫ్), రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు(ఆర్.వి), ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్నలు డిమాండ్.
ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కోసం అమలు చేయనున్న హెల్త్ కార్డుల పథకంపై ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి స్థాయి విధి విధానాలు విడుదల చేయకపోవడం ఆందోళన కలిగించే విషయమని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టి.యు.టి.ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు(ఆర్.వి), ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్నలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన కీలక అంశంలో స్పష్టత లేకుండా హడావిడిగా అమలు దిశగా వెళ్లడం సరికాదన్నారు.హెల్త్ కార్డుల కోసం డేటా నమోదు ప్రక్రియకు ప్రభుత్వం గడువు విధించినప్పటికీ, స్కీమ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పటికీ వెల్లడించలేదన్నారు. అందువల్ల డేటా ఎంట్రీ గడువును కనీసం జూన్ 30 వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు మరియు పెన్షనర్లలో అనేక సందేహాలు నెలకొన్నాయని తెలిపారు. హెల్త్ స్కీమ్ ద్వారా ఏఏ రోగాలకు చికిత్స అందిస్తారు, ఔట్ పేషెంట్(ఓ పి ) సేవలు ఉంటాయా?, లేదా?అత్యవసర చికిత్సల విధానం ఏమిటి, క్యాన్సర్, గుండె, కిడ్నీ, న్యూరో వంటి ఖరీదైన వ్యాధులకు పూర్తి స్థాయి క్యాష్‌లెస్ వైద్యం అందిస్తారా? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.అలాగే ఈ పథకంలో భాగస్వామ్యం అయ్యే ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల జాబితాను జిల్లా వారీగా ప్రకటించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో లేకపోతే ఈ పథకం ప్రయోజనం తగ్గిపోతుందని అన్నారు. ప్రతి నియోజకవర్గ స్థాయిలో నాణ్యమైన ఆసుపత్రులను ఎంపిక చేసి సేవలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు.పూర్తి స్థాయి విధి విధానాలు వెల్లడించకముందే ఉద్యోగుల జీతం నుండి 1.5 శాతం కోత విధిస్తామని ప్రకటించడం సమంజసం కాదన్నారు. జీతం ఆధారంగా కాకుండా కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా ప్రీమియం నిర్ణయించడం మరింత న్యాయ సమ్మతమైన విధానమని అభిప్రాయపడ్డారు.భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే ఇద్దరి జీతాల నుంచీ కోత విధించకుండా ఒక కుటుంబానికి, ఒకే ప్రీమియం విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రతి సంవత్సరం డిపెండెంట్ల వివరాలు సవరించుకునే అవకాశం కల్పించాలని, కుటుంబ పరిస్థితుల మార్పులకు అనుగుణంగా సవరణలు చేసుకునే విధానం ఉండాలని సూచించారు.పెన్షనర్ల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక నిబంధనలు తీసుకురావాలని, వృద్ధులకు వైద్య సేవలు సులభంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆసుపత్రులు, అదనపు బిల్లులు వసూలు చేయకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 24 గంటల టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమైతే అన్ని ఉద్యోగ మరియు ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదింపులు జరిపి, అన్ని సందేహాలకు సమాధానాలు ఇచ్చి, పూర్తి స్థాయి విధి విధానాలు విడుదల చేసిన తర్వాత మాత్రమే హెల్త్ కార్డుల అమలు చేపట్టాలని రామినేని వెంకటేశ్వర్లు(ఆర్.వి) ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా జూనియర్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మరియు సీనియర్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకే విధంగా బేసిక్ పేలో 1.5% ప్రీమియంను కట్ చేయడం సమంజసం కాదు. ఎందుకనగా సీనియర్ మరియు పెన్షనర్లకు డిపెండెన్స్ సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. ఎందుకనగా వారి పిల్లలు 25 సంవత్సరాలు దాటిన వాళ్ళు ఉంటారు. వీరిలో ఎక్కువగా భార్యా భర్తలు మాత్రమే ఉంటారు. కావున డిపెండెన్స్ సంఖ్య ఆధారంగా ప్రీమియం కటింగ్ చేయడము ఉత్తమమైన మార్గమని ప్రభుత్వానికి వారు ఇరువురు సూచించారు.

## రాష్ట్ర అవతరణ వేడుకలకు రంగం సిద్ధం

### పకడ్బందీ ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 29:-
రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న నిర్వహించనున్న వేడుకలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో జిల్లా స్థాయి అధికారులతో కలిసి ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో జరగనున్న రాష్ట్ర అవతరణ వేడుకలను అట్టహాసంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని అధికారులను



ఆదేశించారు. కార్యక్రమ వేదికను పూలతో అందంగా అలంకరించాలని ఉద్యానవన శాఖ అధికారికి సూచించారు.అమరవీరుల స్తూపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాల ప్రగతిని ప్రజలకు వివరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.
రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా ఆయా శాఖలు తమ శాఖల ప్రగతి నివేదికలను సమగ్ర వివరాలతో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలని సూచించారు. కార్యక్రమ సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకల ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళికతో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, కలెక్టరేట్ పరిపాలన అధికారి సునీల్, జిల్లా స్థాయి అధికారులు, పోలీసు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఏరియా హాస్పిటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆర్ కిరణ్ రాజ్





హైదరాబాద్ ఎస్టేట్ 29మే
మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలో ని సింగరేణి ఏరియా హాస్పిటల్, ను చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆర్. కిరణ్ రాజ్ ఈరోజు ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన క్యాజువాలిటీ, వివిధ వార్డులు, ఓపీ విభాగం మరియు ఇతర ఆసుపత్రి సౌకర్యాలను పరిశీలించి, వాటి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్యులతో సమావేశమై ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన సమస్యలు, అవసరాలు మరియు సేవల మెరుగుదలపై చర్చించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ రాజ్ మాట్లాడుతూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మర్యాదపూర్వకంగా, సకాలంలో వైద్య సేవలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (అడ్మిన్) మధు కుమార్, సీనియర్ పిఓ మదర్ సాహెబ్, మ్యాట్రన్ శ్రీమతి విజయలక్ష్మి మరియు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ప్రజా పాలనపై పల్లె పల్లె ఆగ్రహం

హామీల మంటల్లో తెలంగాణ" %
హామీలతో గద్దెక్కి ప్రజలను
చేసినారు మోసం
పేదోడు కడుపుమంటను
రాజకీయమై చేసావ్ రేవంత్
వినయ్యా పల్లె పల్లెలు గర్జిస్తున్నాయ్
ప్రజల కోపాగ్ని ఇప్పుడు జ్వాలై మండుతున్నాయ్

రైతన్న పొలంలో రక్తమే పారుతోంది
రుణాల బరువుతో ప్రాణమే కరుగుతోంది
మద్దతు ధరలన్నీ మాటల్లో మిగిలిపోయాయ్
మట్టిలో రైతుల కలలన్నీ కూలిపోయాయ్..!
ఎండిన చెరువుల్లో కన్నీటి అలలే మిగిలాయి
పంటకోసం ఎదురు చూసే నిరాశ కళ్లే
రైతు రాజ్యం అన్న నినాదం ఎక్కడయ్యా?
రైతన్న చావుల్లో నీ పాలన కనబడదయ్యా..!

విద్యార్థి హాస్టల్లో ఆకలి అరుస్తోంది
స్కాలర్షిప్ డబ్బు కోసం భవిష్యత్తు ఏడుస్తోంది
పుస్తకాల కన్నా ఫీజులే భారం అయ్యాయ్
కలలు కనే పిల్లల రెక్కలే విరిగిపోయాయ్..!
ఉద్యోగ నోటిఫికేషన్ గాలి మాటైపోయింది
నిరుద్యోగ యువత
గుండెలో మంట పెరిగింది
చదివిన డిగ్రీలు గోడలకే వేలాడుతున్నాయ్
యువత ఆశలు రోడ్డుపైనే చచ్చిపోతున్నాయ్..!

గృహిణి గిన్నెలో మంటలే మిగిలాయ్
గ్యాస్ రేట్లతో కడుపులే కాలిపోయాయ్
కూరగాయ ధరలు ఆకాశాన్నంటాయ్
పేదోడు బతుకులు అప్పుల్లో మునిగిపోయాయ్..!

బస్ ఛార్జీలుడ కరెంట్ బిల్లులు
ప్రజల రక్తమే పీల్చే కత్తులయ్యాయ్
ప్రజా పాలన పేరుతో మోసపు పాలన
ప్రభుత్వం తెచ్చారు
మాటల జాతరతో తెలంగాణను
మభ్యపెట్టావ్.. రేవంత్ రెడ్డి

మహిళ భద్రత నినాదాల్లోనే మిగిలింది
బాధితురాలి అరుపు గాలిలో కలిసింది
స్వయం సహాయక గుంపుల ఆశలు కూలిపోయాయ్
అమ్మల చెమట చుక్కలు కన్నీటై
కాలువలు అయ్యాయి
దళిత బస్తీలో చీకటే మిగిలింది
గిరిజన గూడెంలో ఆకలే పెరిగింది
పేదల ఓట్లు మీకు కూర్చునే సీట్లు అయ్యాయి
గెలిచాక వాళ్లే నీకు భారమయ్యారు

వినరా పాలకుడ వీధి గళం లేస్తోంది
వాగ్దానాల మోసాన్ని చరిత్ర రాస్తోంది
అణగారిన జనమే అగ్నిలా రగులైే
అధికార సింహాసనం బూడిదైపోతుంది..!
మీ ప్రజా పాలన ముగింపుకు ప్రజలే
త్వరలో తీర్పు చెబుతారు రేవంత్ రెడ్డి

ప్రజల నుండి తిరుగుబాటు సమరం పుడుతోంది
ప్రజల కోపమే ఉద్యమమై లేస్తోంది
రైతు విద్యార్థి కార్మికుడు కలిస్తే
అణచివేత పాలన నేలమట్టమవుతుంది..
హక్కుల కోసం పోరాటమే మార్గం
ప్రజల గళమే అసలైన రాజ్యం!"

రైతన్నలకు కన్నీళ్లే మిగిలాయి
ప్రజా పాలనలో ప్రజలకు ఇచ్చిన
హామీలు అడ్రస్కే లేవు
ఆర్టీసీ కార్మికులకు అవస్థలు
ప్రజాపాలనలో మహాలక్ష్మి పథకం మాట పత్తకే లేదు
సంక్షేమ పథకాల మాట ఉసే లేదు
గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ఆత్మ హత్యలు
ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం కరువు
తెలంగాణ రాష్ట్రంలో మీడియా మిత్రులకు
యూట్యూబ్ చానళ్ళకు రక్షణ లేదాయె

ప్రజా సమస్యలపై ప్రశ్నించే పాత్రికేయ
విలేకరులపై ఉక్కు పాదం మోపుతుంది కాంగ్రెస్
ప్రజా పాలన సర్కార్
అడిగితే నేరమాయే ప్రశ్నిస్తే పాపమాయే
పేరుకే ప్రజా పాలన పరిపాలనలో లేదు ప్రజా పాలన
ప్రజా పాలన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంది తెలంగాణ
తెలంగాణ గోడు వినబడుతుందా రేవంత్ రెడ్డి

రమేష్ దారమళ్ళ మాదిగ
9133458387

# జిహెచ్ఎంసి కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, సూపర్వైజర్లకు 30 వేల వేతనం ఇవ్వాలి

ఎల్బీనగర్ జోన్ పరిధిలోని జిహెచ్ఎంసి మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటిఎల్లయ్య అధ్యక్షతన జిహెచ్ఎంసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ గారికి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని అదేవిధంగా సూపర్వైజర్లకు కనీస వేతనం 30 వేల రూపాయలు ఇవ్వాలని, 60 సంవత్సరాల తర్వాత రిటైర్మెంట్ అయినట్లయితే రిటైర్మెంట్ బెనిఫిట్ 10 లక్షలు చెల్లించాలని, సూపర్వైజర్లకు నెలకు 3000 రూపాయలు పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలని, ఆదివారం వారాంతపు సెలవు దినాలు పండుగ సెలవులు వర్తింప చేయాలని,



కార్మికులు చనిపోతే వెంటనే 30 వేల రూపాయలు దహన సంస్కారాలకి ఇవ్వాలని, నాగోల్ సర్కిల్లో ఫిబ్రవరి నెల వేతనం చెల్లించని కార్మికులకు వెంటనే ఆ వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మల్లెపాక వీరయ్య హయత్ నగర్



సర్కిల్ సిఐటియు కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య ట్రాన్స్పోర్ట్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ముశము నరహరి,జిహెచ్ఎంసి నాయకులు జంగయ్య, బక్కయ్య, సుక్కమ్మ,యాదమ్మ,స్వరూప, అంజమ్మ,పార్వతమ్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు

# చాలెంజ్ కాదు.. చేతనైతే చేసి చూపెట్టు.. పొంగులేటి శ్రీనివాస్ సవాలుపై కేటీఆర్ సెటైర్లు

'పొంగులేటి.. చాలెంజ్ చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించు.. దమ్ముంటే 20లక్షల ఇండ్లు ఇచ్చిన తర్వాతే ఓట్లు ఓట్లడుగుతానన్న మాట మీద నిలబడు.. ఆ తర్వాతే ప్రజల దగ్గరికి వెళ్లాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. అయినా చాలెంజ్ విసరడ్డుం, తోకముడవడం, ఆపై పారిపోవడం నీతిలేని కాంగ్రెస్ నేతలకు మొదటినుంచీ అలవాటేనని దెప్పిపొడిచారు. 20లక్షల ఇండ్లు కట్టించిన తర్వాతే ఓట్లు అడుగుతామని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విసిరిన చాలెంజ్‌పై గురువారం ఎక్స్ వేదికగా కేటీఆర్ ఘాటుగా స్పందించారు. ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని తన పోస్ట్‌కు ట్యాగ్ చేసి కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శల వాగ్బాణాలు ఎక్కుపెట్టారు. పౌరుషం ఉంటే మాటకు కట్టుబడి ఉండాలని తేల్చిచెప్పారు. కేసీఆర్ పాలనలో కట్టిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వివరాలు వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లపై మాట తప్పిన కాంగ్రెస్ వైఖరిని కడిగిపారేశారు.

ఆత్మగౌరవ సౌధాలు కట్టింది బీఆర్ఎస్సే

ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ బీఆర్ఎస్ అని కేటీఆర్ ఉద్ఘాటించారు. 14 ఏండ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించామని, ప్రజల మద్దతుతో అధికారం చేపట్టి పేదల స్వగృహ స్వప్నాలను సాకారం చేశామని గుర్తుచేశారు. డబ్బా ఇండ్లు కాకుండా డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు అంకురార్పణ చేసి, హైదరాబాద్ మహానగరంలో ఏకంగా లక్ష ఇండ్లు నిర్మించిన ఘనత తమదేనని చెప్పారు. తాము రూ.70 వేలతో గృహాలు నిర్మించలేదని, నాడు కట్టిన ఇల్లు ఏడు ఇందిరమ్మ ఇండ్లతో సమానమని స్పష్టంచేశారు. 'రాష్ట్ర చరిత్రలో ఎవరూ చేయని సాహసంతో, 60 ఏండ్లు ఏలిన పార్టీలకు రాని ఆలోచనతో దేశానికి నమూనాగా అందమైన ఇండ్లను కట్టి చూపించాం.. మీకు చిత్తశుద్ధి, సత్తా, ప్రజలపై ప్రేమ ఉంటే అంతకుమించి హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు నిర్మించాలి' అని డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణ యజ్ఞం చేసిన నిర్మాతలం మేము(బీఆర్ఎస్).. గృహ మేధ యాగం చేస్తున్న విధ్వంసకులు మీరు(కాంగ్రెస్). ఇటుకలు పేర్చి ఇండ్లు కట్టింది మేమైతే.. పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు ఎక్కించి కూలగొడుతున్న క్రూరులు మీరు. రెండున్నరేండ్లలో హైదరాబాద్ నగరంలో మీరు కట్టిన ఇండ్లు ఎన్ని? పడగొట్టిన ఎన్ని? దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలె.

కేటీఆర్

కట్టింది మేము.. కూల్చుతున్న క్రూరులు మీరు

రాష్ట్రవ్యాప్తంగా ఇండ్లు కట్టింది మేము(బీఆర్ఎస్) అయితే కూలగొడుతున్నది మీరు(కాంగ్రెస్) అని కేటీఆర్ ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూల్చడం తప్ప ఒక్క ఇటుకైనా పేర్చలేదని మండిపడ్డారు. వీకెండ్‌లో కొంపలు కూల్చి వికృతానందం పొందుతున్న కాంగ్రెస్ పెద్దలు, ఇండ్ల నిర్మాణం గురించి మాట్లాడేందుకు సిగ్గుండాలని తనదైన శైలిలో దుయ్యబట్టారు. రెండున్నరేండ్లలో నగరంలో కట్టిన ఇండ్లు ఎన్ని? పడగొట్టినవి ఎన్నో ధైర్యముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తుపేల్ మినిస్టర్.. మిస్టర్ బాంబులేటి

నిరుడు దీపావళికి బాంబులు పేలుస్తామని, ఏదో బట్టబయలు చేస్తామని చెప్పి తుస్సుమనిపించిన 'తుపేల్ మినిస్టర్.. మిస్టర్ బాంబులేటి' అంటూ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'పొంగులేటి మాదిరిగా దందాలు చేయడం.. కోహినూర్ హోటల్‌లో కాళ్లు పట్టుకొని ఢిల్లీ పెద్దలకు లొంగిపోయి కేసుల నుంచి తప్పించుకొనే ఉపాయాలు మాకు తెలియవు. అడ్డదారుల్లో కొడుకు కంపెనీకి వేల కోట్ల కాంట్రాక్ట్‌లు ఇప్పించుకొనే అవినీతి కిటుకులు.. అక్రమ క్రషర్లు నడుపుతూ అడ్డగోలుగా సర్కార్ సొమ్మును కొల్లగొట్టే చిట్కాలు



తమకు తెలియవు.. రెవెన్యూ శాఖను అడ్డుపెట్టుకొని భూ భారతిలో బ్లాక్ లిస్ట్‌లు, బ్లాక్‌మెయిల్ దందాలు చేసి దండుకొనే ల్యాండ్ గేమ్స్, గూండాలను ఉసిగొల్పి సామాన్యులపై దౌర్జన్యాలు చేసి భూములను కొల్లగొట్టడం మాకు తెలియవు. బడుగు, బలహీనవర్గాల నేతల మీద అహంకారంతో పేపర్లు విసిరికొట్టం మాకు తెలియవు' అంటూ విమర్శలు గుప్పించారు. తమకు తెలిసిందల్లా తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం.. ఆత్మాభిమానంతో బతుకడం మాత్రమేనని స్పష్టంచేశారు.

పొంగులేటి.. గొప్పలకు పోవడం కాదు. దమ్ముంటే మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్నీ అమలు చేస్తామని ప్రతిన బూనాలి.. మీకు చిత్తశుద్ధి, సత్తా ఉంటే చేసిన చాలెంజ్‌కు కట్టుబడి ఉండాలి. అయినా చాలెంజ్ విసరడం, తోకముడవడం, ఆపై పారిపోవడం నీతిలేని కాంగ్రెస్ నేతలకు మొదటినుంచీ అలవాటే.

కేటీఆర్

ప్రశ్నించకుండా వదిలిపెట్టం

ప్రభుత్వం ఎన్ని పనికిమాలిన ప్రగల్భాలు పలికినా, ఎన్ని డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టడం మానబోమని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్ల ఎగవేత ద్రోహాన్ని ప్రశ్నించకుండా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజాక్షేత్రంలో అడుగడుగునా కాంగ్రెస్ సర్కార్ డొల్లతనాన్ని బట్టబయలు చేస్తామని స్పష్టంచేశారు. ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా వెంటపడుతామని పేర్కొన్నారు.

# బోయ రఘు దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ భీసం చేన్నకేశవరెడ్డి గారు.



కొత్తకోట పట్టణ కేంద్రంలోని ఒకటవ వార్డుకు చెందిన శ్రీమతి&శ్రీ బోయ సరోజరఘు దంపతుల పెళ్లి రోజు సందర్భంగా శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ భీసం చేన్నకేశవరెడ్డి గారు మరియు మాజీ వార్డు సభ్యులు రాజు కూమార్ రెడ్డి, లచ్చిరెడ్డి, జంగం విజయ్ కుమార్, చీర్ల వేంకటేష్, పోతులపల్లి కురుమూర్తి, పి. శేషిరెడ్డి, పి. సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కారు శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిల తొలి విడత మొత్తాన్ని ఇవాళ విడుదల చేశారు. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈరోజు తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను కూడా పూర్తిగా చెల్లించారు. ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి తమ ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోందని వెల్లడించింది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపుతున్నదనడానికి ఇది నిదర్శనమని, ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# డీకే శివకుమార్‌కు చెక్ పెట్టేందుకు, ఢిల్లీ పెద్దల వద్ద సిద్ధరామయ్య సరికొత్త ప్రతిపాదన!



కర్ణాటకలో అధికారం చేతులు మారుతోంది. సిద్ధరామయ్య ఇప్పటికే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. డీకే శివకుమార్ త్వరలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సీఎం పదవిని వదులుకోవడానికి ముందు నుంచి సిద్ధరామయ్య ఇష్టపడటంలేదు. కానీ అధిష్ఠానం ఒప్పించడంతో ఆయన రాజీనామా చేశారు. డీకే శివకుమార్ బాధ్యతలు స్వీకరించడానికి ముందే... పార్టీలో ఆధిపత్యం కోసం అలాగే, రేపు ఆయన సీఎం అయ్యాక పాలనపరంగానూ తమ పట్టు నిలుపుకునేందుకు సిద్ధరామయ్య ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. నిన్న రాజీనామా చేసిన అనంతరం సిద్ధరామయ్య తన కుమారుడితో కలిసి ఢిల్లీకి చేరుకున్నారు. ఈరోజు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ముఖ్య నాయకుడు రాహుల్ గాంధీని కలిసి తన కుమారుడికి కీలకమైన శాఖలు అప్పగించాలని కోరారు. తాజాగా ఆయన అధిష్ఠానం ముందు మరో కీలక ప్రతిపాదన ఉంచారు.కర్ణాటక ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ మధ్య సమన్వయం చేయడానికి ఒక కోఆర్డినేషన్ కమిటీని వేయాలని, తనకు ఛైర్మన్ బాధ్యతలను అప్పగించాలని కాంగ్రెస్ పెద్దల ముందుకు ప్రతిపాదన తీసుకువెళ్లారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయ కమిటీ ఉంటే బాగుంటుందని సూచించారు. 2018లో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం హయాంలో సిద్ధరామయ్య సమన్వయ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో, ఇప్పుడు మరోసారి ఈ ప్రతిపాదనను తెరమీదకు తీసుకువచ్చారు. అయితే పార్టీకి సొంతగా మెజారిటీ ఉన్న నేపథ్యంలో సమన్వయ కమిటీ అవసరం లేదని అధిష్ఠానం చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# ముగిసిన బండి భగీరథ్ పోలీసు కస్టడీ..

## జైలుకు తరలింపు



మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారు బండి భగీరథ్ పోలీసు కస్టడీ ముగిసింది. భగీరథ్ ను పోలీసులు మూడు రోజుల పాటు విచారించారు. విచారణ ముగియడంతో భగీరథ్ ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు చర్లపల్లి జైలుకు తరలించారు.

ఈ కేసు ప్రత్యేక విచారణాధికారి, కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో పోలీసులు భగీరథ్ ను విచారించారు. సీన్ రీకన్స్ట్రక్షన్ చేసేందుకు మొయినాబాద్ ఫామ్ హౌస్ కు కూడా ఆయనను తీసుకెళ్లారు. డిసెంబర్ 31న బాధితురాలిని భగీరథ్ తన స్నేహితులతో కలిసి ఫామ్ హౌస్ కి తీసుకెళ్లి అఘాయిత్యం చేసినట్టు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అయితే పోలీసు విచారణలో పలు ప్రశ్నలకు భగీరథ్ సమాధానాలు చెప్పకుండా మౌనంగా ఉన్నట్టు సమాచారం.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in



## ప్రేమ, త్యాగం, సోదరభావానికి ప్రతీక బక్రీద్ – ఎమ్మెల్యే నాగరాజు,



హజ్రత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ (ఈద్-ఉల్-అదా) పర్వదినాన్ని పురస్కరించుకొని హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులు వారి పలు సమస్యల పైన ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ..., స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగభావాన్ని పెంపొందించడమే బక్రీద్ పండుగ ముఖ్య సందేశమని పేర్కొన్నారు. త్యాగబుద్ధి, నిజమైన భక్తిప్రపత్తులు కలిగినవారే దైవకృపకు పాత్రులవుతారని తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో సాటి మనిషిని ప్రేమించి, అవసరంలో ఉన్నవారికి సహాయం చేసే వారే నిజమైన దైవభక్తులుగా నిలుస్తారని అన్నారు. హజ్రత్ ఇబ్రహీం చూపిన త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పరస్పర ప్రేమాభిమానాలతో, సహృదయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలందరికీ మరోసారి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా మండల గ్రామస్థాయి మరియు ముస్లిం మత పెద్దలు, సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన హనుమకొండ ఆర్డీవో వెంకటేష్..



వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ని హనుమకొండ నూతన ఆర్డీవో వెంకటేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇటీవల ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్, ఎమ్మెల్యే కు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు




బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం బొక్కల గడ్డలోని ఈద్గా మైదానాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అందరితో ఆత్మీయంగా ముచ్చటిస్తూ బక్రీద్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వం, త్యాగానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరుకున్నారు.

# ఉచిత అన్నదానం



పుష్కరాలకు విచ్చేసిన భక్తుల కోసం దేవాలయం ఆధ్వర్యంలో అన్నదాన సత్రం వద్ద ఉచిత అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పుష్కర స్నానాల అనంతరం భక్తులు ఆహార సమస్యలు ఎదుర్కొనకుండా ఉండేందుకు ప్రత్యేకంగా అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి రోజు భక్తులకు పరి శుభ్రమైన ఆహారాన్ని అందిస్తున్నారు. దేవస్థానం సిబ్బంది, వాలంటీర్ల సమన్వయంతో అన్నదానం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నదానంలో పరిశుభ్రత, నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఈఓ మహేష్ సూచించారు. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తూ కాళేశ్వరం పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడుతోంది.

# త్యాగానికి, ప్రేమకు ప్రతిరూపం బక్రీద్

## – రాష్ట్ర మంత్రి కొండా సురేఖ–మురళీధర్ రావు,



బక్రీద్ పండుగను పురస్కరించుకొని వరంగల్ నగరంలోని పలు ఈద్గాలలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి లు అన్నారు

మైనార్టీల సంక్షేమానికి, అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. గురువారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని వరంగల్ నగరంలోని ఎల్బి నగర్, మట్టేవాడ, ఫోర్ట్ వరంగల్ ఈద్గాలలో నిర్వహించిన ప్రార్థనా కార్యక్రమాల్లో మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా సురేఖ-మురళి ని ముస్లిం మత పెద్దలు శాలువాతో సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, బక్రీద్ అనేది త్యాగానికి ,విశ్వాసానికి అల్లాహ్ కి విధేయతకు ప్రతీక అని తెలిపారు. తమ కుటుంబ సభ్యులుగా భావించి తమరిని ఈద్గా ప్రార్థనా కార్యక్రమాలకు ఆహ్వానించిన ముస్లిం మత పెద్దలకు, ఈద్గా కమిటి సభ్యులకు, ప్రజలకు కొండ సురేఖ మురళీధర్ రావు ధన్యవాదాలు తెలిపారు. మైనార్టీలకు దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో తెచ్చిన రిజర్వేషన్ల వల్ల ఎందరో ముస్లింల జీవితాలు బాగుపడ్డాయని నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పునరంకితమైందని చెప్పారు. మైనార్టీల కోసం విద్యా, ఉపాధి, ఆరోగ్య రంగాల్లో అనేక పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. పలు రంగాల్లో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు శాయశక్తులా కృషిచేస్తామని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ తెలిపారు.

సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్రం తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు మంత్రి సురేఖ తెలిపారు.

## మే 31న తెలంగాణ ఉద్యమ కమిటీ సంఘీభావ ర్యాలీని జయప్రదం చేయండి

### – తెలంగాణ ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ కమిటి రాష్ట్ర కన్వీనర్ గోధుమల కుమారస్వామి ఎన్నిక,

### – ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ కమిటీ అధ్వర్యంలో జరిగిన సన్నాహక సమావేశం,

### – ఉద్యమ సంఘాల ఐక్యకార్యాచరణ నూతన కమిటీ ఎన్నిక,




తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం గురువారం హనుమకొండ జిల్లా కేంద్రం ములుగు రోడ్డులోని ముస్లిం మైనార్టీ సెంటర్ లో తెలంగాణ ఉద్యమ ఐక్య కార్యాచరణ కమిటి ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సమావేశాన్ని సునీల్ ప్రారంభించగా, సమావేశానికి ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అధ్యక్షత వహించారు. కమిటి రాష్ట్ర కన్వీనర్ గా ఎన్నికైన గోధుమల కుమారస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో వరంగల్ జిల్లా ముఖ్యపాత్ర పోషించిందని అందులో అన్ని సంఘాలు కలిసి ఒకే వేదిక మీదకు రావడం సంతోషకరమైన విషయమని, ఉద్యమంలో విద్యార్థులు, వివిధ ప్రజా సంఘాలు, నిరుద్యోగులు, ఆర్టీసీ, రైల్వే ఉద్యోగులు, కుల సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు, సబ్బండ వర్గాల పోరాటాలతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ప్రకటించిన పలాలు ఉద్యమకారులకు చెందవలసిన అవసరం ఉందని, ఉద్యమకారులను గుర్తించడానికి వేసిన కమిటీలో నిజాయితీ గలిగిన సామాజిక సంఘాలను కూడా రాష్ట్ర కమిటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేసారు. సాయిని నరేందర్ మాట్లాడుతూ ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు ఉద్యమ సంఘాలు పనిచేయాలని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామ్మూర్తి మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించడానికి వేసిన కమిటీ ఆరు నెలలలో ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేసారు. ఈ కమిటీ వరుసలో అమరవీరుల కుటుంబాలు రెండవ వరుసలో జైలుకుపోయిన వారు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన వారు అలాగే కళాకారులు 1996 నుండి 25 వరకు తెలంగాణ ఉద్యమాన్ని రెచ్చగొడుతున్నారని నక్సలైట్లతో సంబంధాలు ఉన్నాయని రకరకాల కేసులు పెట్టిన వారిని ఉద్యమకారులుగా గుర్తించాలని, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన వారిని రాష్ట్ర కమిటీలో, జిల్లా కమిటీలలో తీసుకోవాలని అప్పుడే నిజమైన ఉద్యమకారులందరికి న్యాయం జరుగుతుందని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని ప్రభుత్వానికి సూచన చేసారు. తెలంగాణ పోరాటంలో కీలక పాత్ర పోషించిన సంఘాలకు అవకాశం కల్పించాలని రామ్మూర్తి ప్రభుత్వాన్ని కోరారు.

ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర నాయకులు సోమ రామ్మూర్తి, ఆల్ ఇండియా ఓబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీనివాస్, న్యూ డెమోక్రసీ నాయకులు నున్న అప్పారావు, తెలంగాణ ఉద్యమ నాయకులు ప్రొఫెసర్ మంద వీరస్వామి తదితరులు మాట్లాడిన అనంతరం తెలంగాణ ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ కమిటీని ఎన్నుకున్నారు ఈ కమిటీలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గా తెలంగాణ ఆకాంక్షల వేదిక రాష్ట్ర కన్వీనర్ గోధుమల కుమారస్వామిని ఎన్నికున్నారు. కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సందెల సునీల్, కాశ బోయిన యాకన్న, గుర్రం రఘు, అంబరీష్ భాషబోయిన, జోగుల సమ్మన్న, కరుణాకర్, ఆకుల పెల్లి మహంకాళి, కార్తీక్, సాదం రాజన్న అంకుషావలి, నవరత్న ఆనంద్, కేడల ప్రసాద్, కృష్ణమూర్తి, చీకటి రాజు మొదలగువారు ఎన్నికయ్యారు. రాష్ట్ర గౌరవ సలహాదారులుగా సోమ రామమూర్తి, సాయిని నరేందర్, జిలకర శ్రీనివాస్, నున్న అప్పారావులను ఎన్నికున్నారు. ఈ సమావేశంలో మహమ్మద్ హాజీ, ఎస్కే గౌస్ బాబు, ఐతమ్ నగేష్, రుద్రోజు నవీన్, చెరుకు ప్రవీణ్, శ్రీనివాస్, దార సూరి, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాలలో ఒడిస్సీ నృత్య వైభవం



కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న పవిత్ర సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా దేవాదాయ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పరంపర ఫౌండేషన్ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఒడిస్సీ నృత్య కళాకారులు అద్భుతమైన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. భారతీయ ఆధ్యాత్మికత, సంగీతం, లయ, భావవ్యక్తీకరణల సమ్మేళనంగా సాగిన ఈ ప్రదర్శనలు విశేష ఆదరణ పొందాయి. కార్యక్రమం ప్రారంభంలో మంగళాచరణ్ ప్రదర్శించబడింది. మహాకవి కాళిదాసు రచించిన శ్యామలా దండకంలోని మాణిక్య వీణా శ్లోకాన్ని ఆధారంగా తీసుకొని మాతంగి దేవిని స్తుతిస్తూ ఈ నృత్యాన్ని ఆవిష్కరించారు. వీణా వాయిస్తున్న దేవి స్వరూపం, చంద్రకళ, కదంబవన విహారం, సంగీత ప్రియత వంటి భావాలను హావభావాలతో అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం త్రిఖండి ప్రణామం ద్వారా దేవతలకు, గురువులకు, ప్రేక్షకులకు నమస్కారం సమర్పించారు. తదుపరి “బట్టు” అనే స్వచ్ఛ నృత్య అంశాన్ని ప్రదర్శించారు. ఒడిస్సీ నృత్యంలో అత్యంత క్లిష్టమైన ఈ ప్రదర్శనలో వీణ, మృదంగం, మంజీరాలు, వేణువు వాయిస్తున్న శిల్ప భంగిమలను నృత్య రూపంలో ఆవిష్కరించి ఒడిశా దేవాలయ శిల్ప సంపదను ప్రతిబింబించారు.

అనంతరం “పల్లవి” ప్రదర్శనలో సంగీతం, లయ, నృత్య కదలికల సమన్వయాన్ని ఎంతో సౌందర్యంగా ఆవిష్కరించారు. సంకరాభరణం రాగంలో సాగిన ఈ నృత్యం లయబద్ధ కదలికలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. తదుపరి “శివ పంచాక్షరి” ప్రదర్శనలో పరమశివుని తాండవ రూపాన్ని శక్తివంతంగా చిత్రీకరించారు. జటాజూటంలో గంగాధరుడు, అర్ధచంద్రధారి, త్రిశూలధారి, డమరుక నాదంతో కామదేవుని దహనం చేసిన మహాదేవుని మహిమను నర్తకులు హావభావాలతో అద్భుతంగా ప్రదర్శించారు. చివరిగా “మోక్ష” మహాకాళి స్తుతితో కార్యక్రమం ముగిసింది. మహాకాళి దేవి ఉగ్రరూపం, సృష్టి-స్థితి-లయలకు మూలమైన ఆదిశక్తి స్వరూపాన్ని ఒడిస్సీ నృత్య భాషలో హృద్యంగా ఆవిష్కరించారు. భక్తి, శక్తి, తత్వబోధల సమ్మేళనంగా సాగిన ఈ ప్రదర్శన ప్రేక్షకులను ఆధ్యాత్మిక అనుభూతిలో ముంచెత్తింది. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ శాస్త్రీయ కళల వైభవాన్ని ప్రతిబింబిస్తూ కాళేశ్వరాన్ని ఆధ్యాత్మిక-సాంస్కృతిక కేంద్రంగా నిలుపుతున్నాయి.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
30 శనివారం మే 2026

# భాగ్యశ్రీ బోర్సే గురించి అలాగే అనుకుంటున్నారు మరి!

భాగ్యశ్రీ బోర్సే .. పాల సరస్సులో పూసిన తెల్లకలువలాంటి అందం. అమరశిల్పి జక్కన ఊహకి కూడా అందని శిల్పం. మబ్బులను .. మెరుపులను కలిపి చేసినట్టుగా కనిపించే రూపం. చోళులు .. చాళుక్యుల కాలం నాటి శిల్పాల వరుసలో తప్ప, ఈ మధ్య కాలంలో ఎవరూ ఎక్కడా చూడని ఒక లావణ్య విశేషం. విశాలమైన కళ్లతో విన్యాసాలు చేస్తూ ఆమె యూత్ హృదయాలను కొల్లగొట్టేస్తోంది. అలాంటి భాగ్యశ్రీ బోర్సే గురించి మాట్లాడుకోని కుర్రాళ్లు ఉండరనే చెప్పాలి. తెరపై భాగ్యశ్రీని చూసిన కుర్రాళ్లంతా ఈ అమ్మాయికి నటన తెలియక పోయినా ఫరవాలేదు. అలా తెరపై కనిపిస్తూ ఉంటే చాలానే అనుకుంటారు. అందువల్లనే పెద్దగా సక్సెస్ లు లేకపోయినా, అవకాశాలు మాత్రం వెతుక్కుంటూనే వస్తున్నాయి. వచ్చే నెల చివరి వారంలో ఈ సుందరి 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ జోడీగా ఆమె చేసిన ఈ సినిమా, భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే ఒక టాక్ బలంగానే వినిపిస్తోంది. అయితే ఇక్కడ మరో విశేషం ఏమిటంటే, 'పెద్ది' సినిమాలో భాగ్యశ్రీ కూడా మెరిసి ఉంటే బాగుండేదనే ఒక టాక్ ఇప్పుడు షికారు చేస్తోంది. 'పెద్ది'లో జాన్వీకపూర్ కథానాయికగా నటించగా, ఐటమ్ సాంగ్ లో శృతిహాసన్ సందడి చేయనుంది. మార్కెటింగ్ పరంగా చూసుకుంటే, మేకర్స్ నిర్ణయం సరైనదే అయినా, గ్లామర్ పరంగా చూసుకుంటే, భాగ్యశ్రీ కూడా ఎక్కడో ఒక చోట మెరిసే ఛాన్స్ ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చరణ్ తరువాత సినిమాలోనైనా ఈ బ్యూటీకి ఛాన్స్ దొరుకుతుందేమో చూడాలి మరి.



## మైఖేల్ జాక్సన్ పాటకు శ్రద్ధా కపూర్ హుషారైన స్టెప్పులు..



బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ డ్యాన్స్ వీడియో ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. పాప్ దిగ్గజం మైఖేల్ జాక్సన్ క్లాసిక్ సాంగ్ 'డోంట్ స్టాప్ టిల్ యూ గెట్ ఇనఫ్'కు శ్రద్ధా తన ఇంట్లో నైట్ డ్రెస్‌లోనే ఎంతో హుషారుగా స్టెప్పులేశారు. ఈ వీడియోను ఆమె ప్రియుడిగా ప్రచారంలో ఉన్న రాహుల్ మోదీ రికార్డ్ చేసినట్లు తెలుస్తోంది.ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న శ్రద్ధా.. 'మిమ్మల్ని ఇలా డ్యాన్స్ చేయించే వ్యక్తిని వెతుక్కోండి' అంటూ ఓ ఆసక్తికరమైన క్యాప్షన్‌ను జతచేశారు. దీంతో వీరిద్దరి బంధంపై జరుగుతున్న ప్రచారానికి మరింత బలం చేకూరినట్లయింది.గత కొంతకాలంగా శ్రద్ధా కపూర్, సినీ రచయిత రాహుల్ మోదీ ప్రేమలో ఉన్నారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ముంబైలో పలుమార్లు డిన్నర్ డేట్‌లకు వెళ్తూ వీరు కెమెరాలకు చిక్కారు. గతంలో వీరిద్దరూ విడిపోయారని రూమర్స్ రాగా, 2024 డిసెంబర్‌లో రాహుల్‌తో కలిసి వడా పావ్ తింటున్న ఫొటోను షేర్ చేసి శ్రద్ధా వాటికి చెక్ పెట్టారు. ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించకపోయినా, ఈ జంట తమ బంధాన్ని పరోక్షంగా వ్యక్త పరుస్తూనే ఉంది. ఇక సినిమాల విషయానికొస్తే, 2024లో వచ్చిన 'స్త్రీ 2' చిత్రంతో శ్రద్ధా భారీ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఆమె 'పహాడ్‌పంగిరా', 'నాగిన్', 'ఈత' వంటి పలు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

# డాన్ 3: అట్లీ డైరెక్ట్ చేస్తేనే వస్తా..

## షరతు పెట్టిన షారుక్!



బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ ఫ్రాంచైజీ 'డాన్ 3'కి సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఇండస్ట్రీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ ప్రాజెక్ట్ నుంచి హీరో రణ్‌వీర్ సింగ్ తప్పుకోవడంతో, మేకర్స్ తిరిగి షారుక్ ఖాన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. అయితే, ఈ సినిమాలో మళ్లీ నటించడానికి కింగ్ ఖాన్ ఒక పెద్ద కండిషన్ పెట్టినట్లు బాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో 'డాన్', 'డాన్ 2' చిత్రాల్లో తన నటనతో పాత్రకు జీవం పోసిన షారుక్ ఖాన్, మూడో భాగం స్క్రిప్ట్‌పై అసంతృప్తితో ప్రాజెక్ట్‌ను నిరాకరించారు. దీంతో ఆయన స్థానంలో రణ్‌వీర్ సింగ్‌ను ఎంపిక చేశారు. అయితే, తాజాగా రణ్‌వీర్ కూడా ఈ సినిమా నుంచి వైదొలగడంతో 'డాన్ 3' భవిష్యత్తు మళ్లీ మొదటికి వచ్చింది. ఈ నేపథ్యంలో చిత్రబృందం మరోసారి షారుక్‌తో చర్చలు ప్రారంభించింది. ఈ క్రమంలో షారుక్ ఒక ఆసక్తికరమైన షరతు విధించినట్లు సమాచారం. 'జవాన్' చిత్రంతో తనకు బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన దర్శకుడు అట్లీకి 'డాన్ 3' దర్శకత్వ బాధ్యతలు అప్పగిస్తేనే తాను ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతానని ఆయన స్పష్టం చేసినట్లు టాక్. ఈ వార్తలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, ఇది బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు, ఈ చిత్రంలో హీరోయిన్‌గా మొదట కియారా అడ్వాణీ పేరు వినిపించినా, ప్రస్తుతం కృతి సనన్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే విలన్ పాత్ర కోసం విజయ్ దేవరకొండ, విక్రాంత్ మాస్సే పేర్లను సంప్రదించారని కథనాలు వస్తున్నాయి. మరి ఈ ఊహాగానాలకు ఎప్పుడు తెరపడుతుందో చూడాలి.

# ఆ ఆరు పాత్రల్లో 'పెద్ది'లోని అప్పలసూరే బెస్ట్: జగపతి బాబు


మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న గ్రామీణ యాక్షన్ డ్రామా 'పెద్ది'లో తాను పోషించిన అప్పలసూరి పాత్ర తన కెరీర్‌లోనే అత్యుత్తమమైనదని నటుడు జగపతి బాబు అన్నారు. నటన, గెటప్ పరంగా ఈ పాత్ర తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని, 'లెజెండ్' తర్వాత తాను గుర్తుపెట్టుకున్న ఆరు ముఖ్య పాత్రల జాబితాలో 'పెద్ది'లోని అప్పలసూరి పాత్రకే నంబర్ 1 స్థానం ఇస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ పాత్ర గెటప్, రూపకల్పన విషయంలో పూర్తి క్రెడిట్ దర్శకుడు బుచ్చి బాబుకే దక్కుతుందని జగపతి బాబు తెలిపారు. "జాతీయ అవార్డు గ్రహీత, మేకప్ ఆర్టిస్ట్ రషీద్ ప్రత్యేక శ్రద్ధతో ఈ లుక్‌ను డిజైన్ చేశారు. ఆ గెటప్ వేసుకున్నప్పుడే ఈ పాత్ర అద్భుతంగా ఉండబోతోందని అర్థమైంది. రామ్ చరణ్ సినిమాలో ఈ పాత్ర చేయడం మరింత ఆనందాన్ని ఇచ్చింది" అని ఆయన వివరించారు. ఇప్పటికే జగపతి బాబు తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేసుకున్నారు.ఇటీవల విడుదలైన 'పెద్ది' ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పింది. గ్రామీణ క్రీడా నేపథ్యంతో సాగే ఈ కథలో రామ్ చరణ్ 'పెద్ది' అనే బహుముఖ ప్రతిభావంతుడైన అథ్లెట్‌గా, అద్భుతమైన ఫిజిక్‌తో కనిపించనున్నారు. చెర్రీ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




# పింక్ అవుట్ ఫిట్ లో బుగ్గలు ఎరుపెక్కిన వేళ..

# ఈ వయ్యారికి యువత దాసోహం అవదా!

టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ సోషల్ మీడియాలో షేర్ చేసిన లేటెస్ట్ పింక్ డ్రెస్ పిక్స్ ఇప్పుడు నెట్టింట మంటలు రేపుతున్నాయి. ఇప్పుడు అల్ బ్లుష్ ,నో బ్లఫ్ అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. పెళ్లయ్యాక సినిమాల స్పీడ్ తగ్గించినా, గ్లామర్ డోస్ మాత్రం అస్సలు తగ్గించలేదు ఈ బ్యూటీ. బ్లష్ పింక్ కలర్ మినీ డ్రెస్‌లో కాజల్ మెరిసిపోతున్న తీరు చూసి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. ఆ విశేషాలు చూద్దాం. చందమామ కొత్త లుక్: కాజల్ అగర్వాల్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫోటోలు కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. పెళ్లి, బాబు పుట్టిన తర్వాత కూడా ఆమె తన ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ సరికొత్త లుక్స్‌తో సర్‌ప్రైజ్ చేస్తోంది. ఇక ఈ సారి బేబీ పింక్ కలర్ స్టైలిష్ డ్రెస్‌లో దివి నుండి వచ్చిన దేవకన్య లా మెరిసిపోయింది. ఈ డ్రెస్ డిజైన్, ఆమె స్టైలింగ్ చూస్తే ఎవరైనా సరే వావ్ అనాల్సిందే. డ్రెస్ స్పెషాలిటీ ఇదే: ూశ్రీంశీ =ఘుం – మహేష్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ యాక్షన్ హంగామా! ూఎజవతీఱంవఎవత్ ఈ ఫోటో షూట్‌లో కాజల్ వేసుకున్న అవుట్‌ఫిట్ చాలా స్పెషల్‌గా ఉంది. స్క్వేర్ నెక్ లైన్, షార్ట్ క్యాప్ స్లీవ్స్‌తో ఉన్న ఈ ఫామ్-ఫిట్టింగ్ మినీ డ్రెస్ ఆమె అందాన్ని మరింత ఎలివేట్ చేసింది. ఇక ముఖ్యంగా డ్రెస్‌కు సైడ్స్‌లో ఉన్న రూచెడ్ డ్రా-స్ట్రింగ్స్ ఈ డ్రెస్‌కు ఒక మోడ్రన్, స్టైలిష్ లుక్‌ని తీసుకొచ్చాయి. మేకప్ అండ్ యాక్సెసరీస్: ఈ సాఫ్ట్-గ్లామ్ లుక్ కోసం కాజల్ మేకప్ అండ్ జ్యువెలరీని చాలా సింపుల్‌గా ఉంచుకుంది. కేవలం చిన్న స్టడ్ ఇయర్ రింగ్స్, చేతికి సింపుల్ బ్రాస్‌లెట్ మాత్రమే పెట్టుకుంది.ఇక డ్రెస్ కలర్‌కు మ్యాచింగ్‌గా బుగ్గలు ఎరుపెక్కేలా లైట్ పింక్ బ్లష్, న్యూడ్ లిప్‌స్టిక్‌తో క్యూట్ అండ్ హాట్ లుక్‌లో మాయ చేసింది. మీరు కూడా ఇలా ట్రై చేయొచ్చు: మీరు కూడా కాజల్ లాంటి రొమాంటిక్, మోడ్రన్ లుక్ ట్రై చేయాలనుకుంటే.. ఇలాంటి స్క్వేర్ నెక్ మినీ డ్రెస్సెలను ఎంచుకోవచ్చు. దీనికోసం 'జారా ఇండియా మినీ డ్రెస్' లేదా 'ఎస్ఆర్ స్టోర్ అరాయా స్క్వేర్ నెక్ డ్రెస్' లాంటి ఆప్షన్స్ పరిశీలించవచ్చు. ఇక జ్యువెలరీని ఎంత సింపుల్‌గా ఉంచితే లుక్ అంత క్లాసీగా కనిపిస్తుంది. ఇక వెండితెరపై మెరిసే తారల గ్లామర్ వెనుక ఎన్నో కష్టాలు దాగుంటాయి, ముఖ్యంగా మాతృత్వం తర్వాత తమ పాత రూపానికి తిరిగి రావడం అనేది ఏ నటికైనా పెద్ద సవాలే. కానీ టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ ప్రసవం తర్వాత ఎటువంటి సర్జరీల జోలికి వెళ్లకుండా, కేవలం పట్టుదల, క్రమశిక్షణతో తన పాత ఫిట్‌నెస్‌ను తిరిగి సాధించి ఎంతో మంది కొత్త తల్లులకు స్ఫూర్తిగా నిలిచింది. భగవంత్ కేసరి సినిమా తర్వాత కాజల్ తెలుగులో పెద్దగా సినిమాలు చేయకపోయినా, ఇలాంటి ఫోటో షూట్లతో ఫ్యాన్స్‌కు ఎప్పుడూ టచ్‌లోనే ఉంటోంది. పింక్ డ్రెస్‌లో బుగ్గలు ఎరుపెక్కిన ఈ వయ్యారి చందమామను చూసి యువత దాసోహం అవ్వకుండా ఎలా ఉండగలరు చెప్పండి.





# తెలుగు చిత్రపరిశ్రమ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉంది

## : దిల్ రాజు ఆసక్తికర వ్యాఖ్య



ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. 'సమ్మర్ హాలీడేస్' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశ్రమ చాలా బ్యాడ్ షేప్‌లో ఉందనే మాట చెప్పడానికి తాను భయపడనని వ్యాఖ్యానించారు. ఈ మాట చెప్పడానికి చాలామంది భయపడతారని అన్నారు. కానీ తాను ధైర్యంగా చెప్పగలనని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులను థియేటర్‌కు రప్పించడం పెద్ద సవాల్ అన్నారు. 'సమ్మర్ హాలీడేస్' వంటి చిత్రాలను తీయడం ద్వారా ప్రేక్షకులను థియేటర్‌కు తీసుకురావాలని వ్యాఖ్యానించారు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రేక్షకులు థియేటర్‌కు వస్తే మంచి సినిమాలు నిలబడతాయని అన్నారు. చిన్న సినిమాలతో డైరెక్టర్లు అందరూ మంచి పేరు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. కొత్త దర్శకులంతా మంచి చిత్రాలను తీసి పరిశ్రమను నిలబెట్టాలని అన్నారు. చిన్న సినిమాలు ఎంత విజయం సాధిస్తే పరిశ్రమ అంత బాగుంటుందని అన్నారు. ఈ చిత్రం ఈవెంట్ చాలా బాగా నిర్వహించారని, ఇందుకు నిర్మాతలను అభినందిస్తున్నానని అన్నారు. ఇటీవలి కాలంలో థియేటర్‌లలో సందడి కనిపించడం లేదని, ఈ చిత్రం ద్వారా థియేటర్‌లో సందడి నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు.